క్లుప్తంగా

రెండు కార్లు ఢీ

వరికుంటపాడు: మండలంలోని భోగ్యంవారిపల్లె బ్రిడ్జి సమీపంలో గురువారం ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్నాయి. వివరాలు.. ఓ కారు కడప నుంచి విజయవాడ వైపునకు బయలుదేరింది. భోగ్యంవారిపల్లి బ్రిడ్జి సమీపంలోకి రాగానే పామూరు నుంచి నెల్లూరు వైపునకు వెళ్తున్న మరో కారు ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొంది.ఈ ఘటనలో రెండు కార్లు ముందు భాగాలు దెబ్బతిన్నాయి. కార్లలోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఎస్సై రఘునాథ్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కారు బోల్తా



సోమశిల: అనంతసాగరం మండలం పాతాళపల్లి వద్ద గురువారం కారు అదుపుతప్పి బోల్తాపడింది. వివరాలు..తిరుపతికి చెందిన ఓ కుటుంబం కారులో శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తోంది. ఈ క్రమంలో పాతాళపల్లి వద్ద డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తాపడింది. కారులోని భార్య, భర్త, ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కలువాయి ఆస్పత్రికి తరలించారు. కాగా సోమశిల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

హుండీ కానుకల లెక్కింపు



సంగం: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. డిసెంబర్ 4 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.78,473 ఆదాయం వచ్చినట్లు ఈఓ రఘురామయ్య తెలిపారు. ఆలయ చైర్మన్ గునుపూడి గిరి, ప్రధానార్చకులు కృష్ణమూర్తి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలువేలం

కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన 3.61 ఎకరాల భూములకు కౌలు వేలం పాటను గురువారం నిర్వహించారు. పలువురు రైతులు డిపాజిట్లు చెల్లించి వేలం ప్రక్రియలో పాల్గొని భూములను దక్కించుకున్నారు. భూముల కౌలు వేలం ద్వారా రూ.2,45,700 రాబడి వచ్చినట్లు ఈఓ రఘురామయ్య తెలిపారు.

పరామర్శ



సీతారామపురం: మండలంలోని గంధంవారిపల్లిలో గురువారం జరిగిన గాజులపల్లి సుబ్బమ్మ ఉత్తరక్రియల్లో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. సుబ్బమ్మ కుమారులు సురేంద్రరెడ్డి, నాగిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, చంద్రభానురెడ్డితో పాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పీసీ అల్లూరురాజు, మునగల రామచంద్రారెడ్డి, వెంకటరెడ్డి, పానెం రమణయ్య, రోశిరెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, గాజులపల్లి రామ్మోహన్‌రెడ్డి, పాలకొలను వెంకటరెడ్డి, తదితరులు ఉన్నారు.

వరికుంటపాడు : భోగ్యంవారిపల్లిలో గురువారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సుర్తినేని గోవిందయ్య ఉత్తరక్రియల్లో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. గోవిందయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో కొద్దిసేపు ముచ్చటించారు. ఆయన వెంట పార్టీ నాయకులు షేక్ అలీఅహ్మద్, మాగంటి సిద్దయ్య, జీ తిరుపతినాయుడు, చెన్నారాయుడు, జీ భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఆవులయ్య, ఎరగూటి మాలకొండయ్య, తదితరులు ఉన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం


వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కే శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

సీతారామపురం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి వర్మికంపోస్టు తయారీ ద్వారా పంచాయతీల ఆదాయాన్ని పెంచాలని ఈఓపీఆర్డీ భార్గవి సూచించారు. మారంరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించి వర్మికంపోస్టు తయారీని పరిశీలించారు. అనంతరం మారంరెడ్డిపల్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు.

భక్తుల కొంగుబంగారం సంగమేశ్వరుడు

- రేపట్నుంచి 15వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు
- ముస్తాబవుతున్న ఆలయం



సంగమేశ్వరాలయం గోపురం

సంగం:సంగంలో త్రివేణి సంగమం ఒడ్డున వెలసియున్న కామాక్షితాయి సమేత సంగమేశ్వరుడు భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. త్రేతాయుగంలో తండ్రి మాట జవదాటని పరుశురాముడు తన తల్లిని గండ్రగొడ్డలితో వధించాడు. తల్లిని చంపిన మహాపాప విమోచనం కోసం పెన్నానది పరివాహక ప్రాంతాల్లో స్వయంగా శివలింగాలను ప్రతిష్ఠించారు. అందులో భాగంగా సంగంలోని పెన్నానది, బొగ్గేరు, బీరాపేరు కలిసే త్రివేణి సంగమం ఒడ్డున 101వ శివలింగాన్ని ప్రతిష్ఠించి సంగమేశ్వరుడిగా పరశురాముడు నామకరణం చేసినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. సంగమం అంటే కలయిక అని, కాలగమనంలో నాటి త్రివేణి సంగమమే నేటి సంగం గ్రామంగా మారిందని చరిత్ర చెబుతోంది.. ఆ తరువాత రెడ్డిరాజులు సంగమేశ్వరుని చెంతనే కామాక్షిదేవి అమ్మవారిని ఆలయాన్ని నిర్మించి కామాక్షిదేవి సమేతుడైన సంగమేశ్వరునిగా నామకరణం చేశారు. ఆ నాటి నుంచి సంగమేశ్వరుడు నిత్యం ధూపదీప నైవేద్యాలను అందుకుంటున్నారు. జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన సంగమేశ్వరాలయంలో ఏటా ఏప్రిల్‌లో 13 రోజుల పాటు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల ప్రారంభ సమయంలో అందజేసే కొడిముద్దలు తిన్న మహిళలకు సంతానం కలుగుతుందనేది భక్తుల నమ్మకం. అందుకే జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న సంగమేశ్వరాలయం

5వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు

ఏప్రిల్ 5న ధ్వజారోహణంతో సంగమేశ్వరుని బహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 6న శేష వాహనం, 7న అశ్వ వాహనం, 8న సింహ వాహనం, 9న పులి వాహనోత్సవం నిర్వహించనున్నారు. 10న రావణ సేవ, 11న నందిసేవ, 12న రథోత్సవం, పురుషామృగవాహనం, 13న సాయంత్రం గిన్నెభిక్ష, రాత్రికి కల్యాణోత్సవం, 14న సాయంత్రం అలకలతోపు, రాత్రి ధ్వజావరోహణం, 15న సాయంత్రం గంధపడి ఉత్సవం, రాత్రి ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఈఓ రఘురామయ్య తెలిపారు.

రీసర్వేపై అవగాహన సదస్సు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం ఊటుకూరులో తహసీల్దార్ ఎస్కే హమీద్ ఆధ్వర్యంలో రీసర్వేపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులకు సంబంధించి ఏడు వేల ఎకరాల భూమి ఉందని తెలిపారు. భూమిని 28 భాగాలుగా విభజించి రీసర్వే చేపట్టనున్నట్లు చెప్పారు. రీసర్వేను సజావుగా నిర్వహించేందుకు రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్వేయర్ బీ రవికుమార్, వీఆర్వో రమణయ్య పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ ఆనంద్

మర్రిపాడు: జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఉపాధి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆనంద్ అన్నారు. మండలంలోని డీసీపల్లిలో ఉపాధి హామీ పథకం కింద నీటి తొట్టె నిర్మాణానికి గురువారం కలెక్టర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 963 నీటి తొట్టెలను నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటి వరకు 693 నిర్మాణాలకు రూ.2.22 కోట్లతో ఆమోదం పొందినట్లు తెలిపారు. వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలు ఏఏ గ్రామాల్లో అవసరమో పశుసంవర్ధకశాక అధికారులతో కలిసి గుర్తించి ఏప్రిల్‌లోగా నిర్మించాలని ఉపాధి అధికారులను ఆదేశించారు. జిల్లాలో రూ.47.25 కోట్లతో 7,500 పంట కుంటలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో నీటిని ఒడిసి పట్టుకునేందుకు ప్రతి రైతు తన పొలంలో పంట కుంటలను నిర్మించుకోవాలని సూచించారు. జిల్లాలో 272 చెరువులను రూ.23.90 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. జిల్లాలో రూ.81.25 కోట్ల వ్యయంతో 8,737 కి.మీ. మేర కాలువల్లో పూడికతీత చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఉపాధి కూలీలకు 60 లక్షల పనిదినాలు కల్పించాలని, కూలీలకు వేతనం రూ.307 దక్కేలా పనులు చూపాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. అనంతరం డీసీపల్లిలో పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్విద్యుత్ పలకలను నిర్మించుకున్న లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఇళ్లపై సోలార్విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఆయన వెంట విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయానంద్, డ్వామా పీడీ గంగాభవానీ, ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని, తహసీల్దార్ అనిల్, ఎస్సై శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, విద్యుత్‌శాఖ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్

వైభవంగా హనుమంతసేవ



ఆత్మకూరు: కోదండరాముడికి హనుమంతసేవ

ఆత్మకూరు: పట్టణంలోని సుందరమ్మ కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి హనుమంత సేవను వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి హనుంత వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం జరిపారు.



ఆత్మకూరురూరల్: సీతారాములకు నైవేద్యాలను తీసుకొస్తున్న ఉభయకర్తలు

ఆత్మకూరురూరల్: గండ్లవేడులో శ్రీరామనవమి ఉత్సవాలు గురువారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి.తొలిరోజు హనుమంత వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఉత్తరవీధికి చెందిన వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకురావాలి

కలిగిరి: గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకురావాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. ఎరుకులరెడ్డిపాళెంలో షేక్ ఖాజామస్తాన్, నూర్జహాన్ దంపతుల సహకారంతో అభయాంజనేయస్వామి విగ్రహానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అనంతరం షేక్ ఖాజామస్తాన్ దంపతులు ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం పలు సమస్యలతో బాధపడుతున్న 20 మందికి ఖాజామస్తాన్ దంపతులు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. అలాగే పలు ఆలయాలకు విరాళాలు, విగ్రహాలను అందజేశారు. గ్రామంలో కోదండరామస్వామి ఆలయాన్ని నిర్మిస్తామని ఖాజా మస్తాన్ హామీ ఇచ్చారు. కావలి మాజీ ఎమ్మెల్యే ఒంటేరు వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ విజయలక్ష్మి, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు రాధయ్య, బీవీ రామారావు, వెంగపనాయుడు, కొండపనాయుడు, తాతయ్య, తదితరులు పాల్గొన్నారు.



మినరల్‌వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కాకర్ల

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని వినతి

దుత్తలూరు: విద్యుత్ లోఓల్టేజ్ సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని నందిపాడు, వెంకటంపేట గ్రామాల ప్రజలు వాపోయారు. గురువారం దుత్తలూరుకు వచ్చిన కలెక్టర్ ఓ ఆనంద్‌కు విద్యుత్ సమస్యను మొరపెట్టుకున్నారు. తమ గ్రామాల్లో లోఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని విన్నవించారు. స్తంభాలు శిథిలావస్థకు చేరి చిన్నపాటి గాలివీచిన నేల కొరుగుతున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలకు గురవుతున్నామన్నారు. విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని కోరినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ విద్యుత్ శాఖ ఎస్‌ఈతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



కలెక్టరుకు విన్నవిస్తున్న గ్రామస్తులు

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర అందించాలి

మర్రిపాడు: పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లభించేలా రాష్ట్ర ప్రభుత్వం, పొగాకు బోర్డు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, డీసీపల్లి వేలం కేంద్రం రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మూలి వెంగయ్య కోరారు. డీసీపల్లి వేలం కేంద్రంలో జరుగుతున్న పొగాకు వేలం ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. వేలం కేంద్రం అధికారులు, రైతులతో మాట్లాడారు. గతేడాది కిలో పొగాకుకు గరిష్ఠ ధర రూ.350 అందజేశారని ఆయన తెలిపారు. ఈ ఏడాది గరిష్ఠ ధర రూ.280తో వేలాన్ని ప్రారంభించారని, సగటు ధర రోజురోజుకు తగ్గిపోతుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందించకుంటే నష్టపోయే అవకాశముందని, రైతులకు గిట్టుబాటు ధర అందించి ఆదుకోవాలని కోరారు.



వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న మూలి వెంగయ్య

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 280

కలిగిరి:స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకుకు గరిష్ఠ ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 438 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 334 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 104 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి వీ మహేష్‌కుమార్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ. 280, కనిష్ఠంగా రూ.235, సరాసరిన రూ. 266.58 ధర పలికిందని వివరించారు. కాగా వేలంలో పది కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

11న సాయిబాబా మందిరంలో వార్షిక వేడుకలు

వరికుంటపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలోని సాయిబాబా మందిరంలో ఈ నెల 11న తృతీయ వార్షిక వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు సుంకర వెంకటాద్రి, సుజన దంపతులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా సాయిబాబాతో పాటు విఘ్నేశ్వరుడు, దత్తాత్రేయుడు, గోపాలకృష్ణుడికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరత్నమ్మ

దుత్తలూరు: రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన దుత్తలూరు సమీపంలో 565వ జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. దుత్తలూరు సెంటర్‌కు చెందిన నాగరత్నమ్మ నర్రవాడ మార్గంలోని ఎస్సీ కాలనీకి వెళ్లి తిరిగి దుత్తలూరు సెంటర్‌కు నడుచుకుంటూ వస్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె ఎడమ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి హైవే అంబులెన్స్‌లో ఆమెను చికిత్స నిమిత్తం ఉదయగిరి వైద్యశాలకు తరలించారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 11వ వార్డుకు చెందిన గుర్రం ప్రమీల, 18వ వార్డుకు చెందిన ఈగా కళ్యాణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.వారి కుటుంబ సభ్యులను ట్రస్టు ప్రతినిధులు పరామర్శి పరామర్శించి రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, నరసింహరెడ్డి, వెంకటరమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ నిరసన



ఉదయగిరి: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉదయగిరి ఆర్టీసీ డిపోకు చెందిన నేషనల్ మజ్దూర్ యూనియన్ సిబ్బంది గురువారం నిరసన తెలిపారు. ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై తమ నిరసనను వ్యక్తం చేశారు. 1/19 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కూడా నిరసనను కొనసాగించనున్నట్లు యూనియన్ నేతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

వింజమూరు(ఉదయగిరి)/కలిగిరి/సీతారామపురం : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వింజమూరు, కలిగిరి, సీతారామపురం మండలాలకు సంబంధించి నూతన కమిటీలను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

- వింజమూరు మండల ఉపాధ్యక్షుడిగా మద్దూరి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శులుగా లింగాల దిన్నె శేఖర్,కర్నాటి రమణారెడ్డి, కాటం రమణారెడ్డి, కోశాధికారిగా ఆనంగి రాజేష్, కార్యదర్శులుగా అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, మందాటి మధుసూదన్‌రెడ్డి, జ్యోతి చెన్నయ్య, గుమ్మా మాల్యాద్రి, అట్ల నారసింహారెడ్డిని నియమించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వీ శ్రీనివాసులు, వంటేరు వెంకటేశ్వర్లు, గంగపట్ల మురళి, కనీయంపాటి మురళి, షేక్ కరీమ్, అల్లూరి నాగేశ్వరరావు, కాటంరెడ్డి బాబురెడ్డి, పత్రి కోటేశ్వరరావు, పందిటి రాజేంద్ర, చిలకల కృష్ణారెడ్డి, దుర్గంపాటి మధు, రాపూరి వెంకటేశ్వర్లు, గుడిపాటి ఆలీబాబు, ఓరుసు యానదయ్య, బత్తుల సంజీవరాయుడును నియమించారు.
- కలిగిరి మండల ఉపాధ్యక్షులుగా చీమల మాల్యాద్రి, మూలి రాధాకృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీలుగా గునపాటి మహేష్‌రెడ్డి, సుద్దల మోహన్, ఆవుల వెంకటకృష్ణారెడ్డి, ట్రెజరర్‌గా మార్లెళ్ల సుందరరామిరెడ్డి, కార్యదర్శులుగా మాలపాటి ప్రసాద్‌రెడ్డి, తేళ్ల భాస్కర్‌రెడ్డి, కందుల రమణారెడ్డి, దాసరి మహేంద్ర,, జాగీరు గిరిబాబును నియమించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కందుల బాబుల్‌రెడ్డి, బంకా ప్రసాద్, గూడా మాల్యాద్రిరెడ్డి, ఆముదం పిచ్చిరెడ్డి, నల్లపనేని ప్రసాద్, పందల శ్రీనివాసులు, నర్రావుల మాల్యాద్రి, కోట కిషోర్, గోసాల మల్లికార్జున, పుల్లా రవి, పేరిశెట్టి వెంకటరత్నం, వీరంరెడ్డి శ్రీనివాసులు, నలతాటి యాదగిరి, ఉప్పరపల్లి కృష్ణారెడ్డి, ఆవుల ప్రసాద్‌రెడ్డిని నియమించారు.
- సీతారామపురం మండల ఉపాధ్యక్షులుగా రామిశెట్టి తిరుపతయ్య, గోరంట్ల చిన్నతిరుపాలు, జనరల్ సెక్రటరీలుగా పిడతల ఓబులేసు, బాలినేని పెదమాబయ్య, బసిరెడ్డి రమాదేవి, ట్రెజరర్‌గా పొట్టి రామచంద్రయ్య, సెక్రటరీలుగా మద్దినేని శ్రీనివాసులు, లకిడి బ్రహ్మయ్య, ఉప్పలపాటి మౌలాలి, గుండ్లపల్లి తిరుపాలు, అల్లూరు ఓబులపతిని నియమించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గుర్రం సుబ్బయ్య, ఓంకారం నాగేశ్వరరాజు, తమ్మిశెట్టి వెంకటనారాయణ, లక్కిపోగు రాజేష్, పాలకొలను వెంకటరెడ్డి, దుగ్గిరెడ్డి సుబ్బారెడ్డి, కొసినిపోగు ఏసురత్నం, మాచిరాజు వెంకటేశ్వరరాజు, కలివెల సతీష్‌కుమార్, ఇర్ల సలోమి, చెరుకుపల్లి శ్రీదేవి, గాజులపల్లి పెదవెంకటసుబ్బారెడ్డి, రేనాటి రమణయ్య, మేడిబోయిన దుగ్గయ్య, కండేల శ్రీరాములును నియమించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

ఉదయగిరి: ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే ప్రజారవాణా సంస్థ లక్ష్యమని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టీ నాగేంద్రప్రసాద్ తనిఖీ చేశారు. ఉదయగిరి డిపోను గురువారం ఆయన సందర్శించారు. డిపోలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి ఉద్యోగులు, కార్మికులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల పట్ల సిబ్బంది గౌరవంగా వ్యవహరించాలన్నారు. ఆర్టీసీని ప్రజలకు మరింతచేరువ చేయాలన్నారు. రోడ్లపై ఎక్కడ ప్రయాణికులు ఆపినా వదలివేయకుండా ఎక్కించుకుని వారిని గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఇటీవల ఉదయగిరి డిపోకు ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ సర్వీసులను కేటాయించామన్నారు. ఉదయగిరి నుంచి సీతారామపురం మీదుగా విజయవాడకు కొత్త సర్వీసును ప్రారంభించామన్నారు. త్వరలో కర్నూలుకు కొత్త సర్వీసు నడిపే యోచనలో ఉన్నామని తెలిపారు. గ్యారేజీ సిబ్బంది బస్సుల నిర్వహణ బాగుండేలా చూడాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ సీఎంఈ శ్రీనివాసులరెడ్డి, డీఎం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఈడీ నాగేంద్రప్రసాద్

వైభవంగా ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ

వరికుంటపాడు: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో నూతన ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రెండోరోజు రుత్వికుల ఆధ్వర్యంలో ఉదయం గణపతిపూజ, కలశ ఆవాహనం, నూతన ఉత్సవ విగ్రహాలకు అష్టోత్తర శతకలశాభిషేకం, విశేషాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం, ధాన్యాధివాసం,జలాదివాసం, పుష్పాదివాసం, శయ్యాదివాసం,తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలి

దుత్తలూరు: ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. దుత్తలూరు మండల పరిషత్ కార్యాలయంలో దుత్తలూరు, వరికుంటపాడు మండలాల వ్యవసాయాధికారులు, రైతుసేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులతో గురువారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వ్యసాయ పథకాలకు విశిష్ట సంఖ్య తప్పనిసరని తెలిపారు. ఏఓలు, వీఏఏలు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తో రైతులకు కలిగే ప్రయోజనాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి నమోదు చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం ఏడీఏలు నర్సోజీరావు, శేషగిరి ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయడానికి సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి, వ్యవసాయాధికారులు నాయక్, రవికుమార్ పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

వైద్యారోగ్య, రెవెన్యూ శాఖల్లో ప్రక్షాళన చేపట్టాలి

జలదంకి: మండలంలో వైద్య ఆరోగ్య, రెవెన్యూ శాఖల అధికారులు సక్రమంగా పనిచేయడం లేదని, వ్యవస్థలు అవినీతిమయంగా తయారయ్యాయని, ప్రక్షాళన చేపట్టాల్సిన అవసరం ఉందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథరెడ్డి అన్నారు. జలదంకిలోని బీజేపీ కార్యాలయంలో మండల నాయకులతో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. జలదంకి పీహెచ్‌సీ లో వైద్యుల నిర్లక్ష్యంతో 24 గంటలు వైద్యసేవలు అందడం లేదన్నారు. నాలుగేళ్లుగా వైద్యులను బదిలీ చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. పీహెచ్‌సీలో నాలుగున్నరేళ్ల కాలంలో కేవలం 57 కాన్పులు మాత్రమే జరిగినట్లుగా డాక్టర్లు చెబుతున్నారన్నారు. అందులో కూడా ఇంటి వద్ద జరిగిన కాన్పులను పీహెచ్‌సీలో చేసినట్లుగా నమోదు చేశారని ఆరోపించారు. పీహెచ్‌సీ అభివృద్ధి నిధుల్లోనూ గోల్‌మాల్ జరిగిందన్నారు. గతేడాది నుంచి పీహెచ్‌సీలో ల్యాబ్‌టెక్నీషియన్ లేకుండా రక్త పరీక్షలు ఎలా చేస్తున్నారో, పీహెచ్‌సీ ఉద్యోగి రసూల్‌కు గత 18 నెలల నుంచి ఎందుకు బిల్లులు ఎందుకు పెట్టడం లేదో చెప్పాలని వైద్యులను కోరారు. 2023లో మిచాంగ్ తుఫాన్ సమయంలో రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఆ సమయంలో రిలీఫ్ క్యాంపులో 96 మంది గిరిజనులు ఉంటే తాము సహాయం అందించామన్నారు. అయితే ప్రభుత్వం నుంచి అందిన సాయంలో రూ.32,600 భోజనానికి, పాలకు రూ.2వేలు ఖర్చు చేసినట్లుగా అధికారులు చూపించారన్నారు. పేద ప్రజలకు సాయం అందించాల్సిన అధికారులు ఇలా అవినీతికి పాల్పడడం దారుణమన్నారు. అధికారుల అవినీతిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు ముడి కిషోర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంటేరు రాకేష్‌రెడ్డి, నాయకులు కమతం బాలకోటయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.